# నోౖ దైసెల్ఫ్ |

నడిబజారులో నిలబెట్టి పెళ్ళాన్ని అమ్ముకున్న చక్రవర్తు లున్నారు. మొగుడ్ని తులాభారం వేసి జిత్తులమారి సన్యాసికి దానంచేసిన భామ లున్నారు. ఒకటి ధర్మం కోసమైతే రెండోది వాళ్ళ పొగరు. అమ్మజూపడం ట్రాజడీయే కాదంటారా?

నాకు జీళ్ళన్నా, ట్రాజడీలన్నా చాలా యిష్టం!

" బలే మంచి చౌకబేరమూ " అని నారదుడు పాడుతూ శ్రీకృష్ణుడ్ని వీథివీథులా త్రిప్పి అమ్మజూపుతుంటే నాకే ఫీలింగు రాలేదు, కాని —

జవదాటి ఎరుగదీ యువతీ లలామంబు పతిమాట రతనాల పైడి మూట అని హరిశ్చంద్ర చక్రవర్తి కాశికాపుర వీధులలో చంద్రమతిని నిలబెట్టి అమ్మతూ ఆమె ఒక్కొక్క లక్షణాన్ని భార్య సుగుణాలను వర్ణిస్తుంటే నాటకమని తెలిసే బొటబొటా కన్నీళ్ళు కార్చేశాను.

హరిశ్చంద్ర నాటకమంటే చాలా యిష్టం నాకు. కడుపు తరుక్కుపోయే పద్యాలున్నాయి, మచ్చుకి.

దళమౌ పయ్యెదలో నడంగియు
సముద్యత్ కాంతులీనంగ....
కోటిసూర్య ప్రభాకలితంబై
వెలుగొందుచున్న దదేనీ
మాంగల్యంబు కాబోలు-దాని
నే వెలకైనన్ తెగనమ్మి. నీ సుతునకై వెచ్చించినన్ చెల్లదే!

ఎందుకు చెల్లదు? మంగళసూత్రం కూడా అమ్మేసేయమని మొగుడు పెళ్ళానికి చెబుతున్నాడు. ఎటువంటి దౌర్భాగ్యం? ఆమె మాంగల్యం ఆమె భర్తకు తక్క అన్యులకు కనపడదట, కాటిసుంకం చెల్లించకుండా కొడుకు శవమైనా కాల్చడానికి వీలులేదు. రూల్సు ప్రకారం నడిచే మొగుడ్ని కట్టుకుని చంద్రమతి అష్టకష్టాలూ పడింది.

జాషువాగారి స్మశానం పద్యాలన్నా నాకిష్టవే- ఈ స్మశాన స్థలిన్ కన్నుల్ మోడ్చిన మందభాగ్యుడొకడైనన్ లేచి రాడక్కటా, ఎన్నాళ్ళీ చలనంబులేని శయనంబే తల్లులల్లాడిరో, కన్నీటంబడి క్రాగిపోయినవి నిక్కంబిందు పాషాణముల్, ఇవి బలిజేపల్లిగారి పద్యాలకు ఫిరాయించి చదువుతుంటారు. "మాయామేయజగంబు" "చతురంబోధి పరీత భూవలయ" అన్నా నాకిష్టవే.

"ఇట నిటాలేక్షణుండు- గజ్జె కదలించి యాడు రంగస్థలమ్ము" అని చెప్పి "ఇది అవని పాలించు భస్మ సింహాసనమ్ము" అంటాడు జాషువా కవి. "ఇచ్చోటనే కదా ఏ లేత యిల్లాలి నల్లపూసలసౌరు గంగలో కలిసిపోయె" నని కవి దుఃఖిస్తాడు. "ఐ లైక్ జాషువా—తింటే గారెలు తినాలి, చదివితే పొయిట్రీ చదవాలి! నాకు కృష్ణ నిర్యాణం, పద్యాలు విన్నా ఏడుపొచ్చేస్తుంది. ధర్మరాజు "మున్నుగ్రాటవిలో వరాహమునకై ముక్కంటితో బోరుచో" అని ఏవేవో కోట్ చేసి "కన్నీరెన్నడు లేదు తండ్రి చెపుమా కళ్యాణమే శౌరికిన్" అని అడుగుతాడు. గీత చెప్పినవాడి గీత ఎలా వుందో తెలుసుకోవాలని 'మన సారథి' మన సచివుడు. మన నెయ్యము మన సఖుండు" అని ఏవేవో చెప్పి "మనలను దిగనాడి చనియె మనుజాధీశా" అని చావుకబురు చల్లగా చెప్పాడు. అన్నగారు తండ్రీ అని పిలిస్తే తమ్ముడు మనుజాధీశా అన్నాడు. కృష్ణార్జునులు అనేది గొప్పద్వంద్వసమాసము. "పాపం విజయుడు" మంత్రియై ఒకవేళ మంత్రమాదేశించు మన్నించు నొకవేళ మరదియనుచు" అని పేరు పేరు వరసలా తల్చుకుని తల్చుకుని కుమిలి

పోతాడు. కృష్ణుడు పోయినపుడు టెలిప్రింటర్సు లేవు. ఆలిండియా రేడియో లేదు. కీర్తిశేషుల్ని గురించి వాపోవడానికి ఇన్ని పత్రికలు లేవు. యింతమంది జర్నలిస్టులు లేరు. ప్రెస్సుబిల్లు లేదు——తుస్సు బిల్లులేదు. వ్యాసులవారు చెప్పినదానినిబట్టి పోతనగారేవో నాలుగు పద్యాలు చెప్పారు కాబట్టి అవి చదువుకుని కళ్ళు తుడుచుకుంటున్నారు. ఇంతకీ మన (మోడ్రన్సు, అమ్మలు, బామ్మలు, అమ్మమ్మలకు మినహాయింపు వుంది) పొయిట్రీ చదవరు. దే డోంట్ కేర్- మెజారిటీ ఆడాళ్ళు సినిమాలు చూస్తారు, సీరియల్సు చదువుతారు, శ్రోతలు కోరిన పాటలు వింటారు. కవితాకుమారి, కవితాకన్య, కావ్యసుందరి, కవితాసరస్వతి అని స్త్రీపరంచేసి ఎంత గౌరవించినా స్త్రీ జనానీకానికి కవిట్రీ అంటే గిట్టదు. మరి ప్రోజు బాగా రాయాలంటే పొయిట్రీ బాగా ఖుణ్ణంగా చదవాలికదా! "వానలో తడియనివారు మద్గురు మృదూక్తి మరంద దారలో తనియనివారు లేర" ని విశ్వనాథవార న్నారుగాని, వానలో తడవకుండావుండడంకోసం గొడుగులు, రైన్‌కోట్లువాడి రిక్షాలో అన్నా వెడతారుకాని యిప్పటి రైటరీమణులు. పొయిట్రీ చదవరుగాక చదవరు. చాలామంది కుర్రాళ్ళు పొయిట్రీ కురిపించే హర్షంలో తనియడానికిష్టపడనివారే— హూ కేర్స్ ఫర్ పొయిట్రీ— కవిత్వానికి మార్కెట్ లేదని తెలిసీ పాపం కవులు రాయడం మానరు. అయిదోక్లాసు ప్యాసయిన అమ్మాయిని అలరింపచేయడం మనలక్ష్యంగా పెట్టుకున్నాం గనుక మన పొయిట్రీకి, నవలలకి, మన కథలకి పట్టిన అధోగతి మన పత్రికలు, సినిమాలు, మన పిక్‌పాకెట్టు బుక్సు చూస్తే తెలుస్తుంది.

ఏ విషయాన్నైనా సరళంగా, సుబోధకంగా చెప్పే తీరుని మనం అద్భుతంగా డెవలప్ చేసుకున్నాం. కాదన్నా— ఈ డెవలప్‌మెంటంతా మనకున్న మార్కెట్‌ను పెంచుతుందేకాని తుష్టినీ పుష్టినీ చేకూర్చడం లేదు. మన ప్రయిజు కథలూ, మన ప్రయిజు నవలలూచూస్తే ఈ నిజం

పెనుభూతంలా కనిపించి మన కళల్ని, మన రచయితల్ని ఎలా లొంగదీసి వికృతంగా మార్చేస్తోందో బోధపడుతుంది.

పాఠకుడుగారు కొంతారో కొనరో, మొదటివాక్యం చదివి త్రిప్పేస్తారేమో, వారికి చిరాకుకలిగిస్తున్నావేమో, వారిమూడ్సుని అందుకోలేకపోతున్నానేమోనని "బాక్సాఫీసు" సూత్రాలను వెదుక్కుంటూ— చిత్తం చిత్తం అంటూ ఐదోక్లాసు పాసయి- పియ్యూసీ ఫెయిలయినవారి హావభావ విలాసాదులను ఆకళింపు చేసుకుందుకు కుస్తీలుపడుతూ పిల్లిమొగ్గలువేస్తూ, రంగులుపులుముతూ అట్టహాసంతో (కవరుపేజీబొమ్మలు మరేం కాదు) సాహిత్య హింసాకాండ కొనసాగిస్తున్నాం. ఇది పెద్ద ట్రాజడీయే. ఎవరు వప్పుకున్నా వప్పుకోకపోయినా—

ఐ లైక్ జాషువా అని యిందాట్లా చెప్పేను. ఐ లైక్ కృష్ణశాస్త్రి, ఐ వర్షిప్ విశ్వనాథ సత్యనారాయణ, ఐ ఎడోర్ శ్రీ శ్రీ.... ఐ రీడ్ దాశరథి మరియు ఆరుద్ర- ఐ రైట్ ప్రోజు బటయి రీడ్ మోర్ పొయిట్రీ ...

ఎసరు పైకి తన్నోవుంటే మూత ఎగిరెగిరి పడ్డట్టు వంట్లో టెంపరేచరు (టెంపరు కాదు) ఎక్కువగావుండి జ్వరం పైకి తన్నోన్నప్పుడు వండర్‌ఫుల్ ఆలోచనలు వస్తూంటాయి నాకు. దాన్ని జ్వరం ఫిలాసఫీ అంటారు మావారు. ఆయన స్వదేశీ విదేశీ పత్రికలన్నీ ముందేసుకుని ఛండాలపు బొమ్మలన్నీ రెప్పవాల్చకుండా చూస్తూంటారు. మగాళ్ళకిదో నాస్టీ హాబీ.

"ఇటీజ్ నాట్ ది ఫొటోగ్రాఫిక్ సౌందర్యం బట్ ది గుడ్ మనస్సూ ఆఫ్ ది గరల్, దటీజ్ వెరి వెరీ ఇంపార్టెంటూ" అన్నా.

"షటప్" అన్నారు బొమ్మలు నా కక్కనపడకుండా దాచేస్తూ.

"నో దై సెల్ఫ" అన్నాడు ఇంగ్లీషువాడు.

నిన్ను నీవు తెలుసుకో అన్నారు జ్ఞానులు. కాని నా చిన్నప్పుడు అరుగుమీద కూర్చుని వీపు గోక్కోవడం తెలీక ఏడ్చేసేదాన్ని. ఎవరి

వీపు వారికి కనిపించదు. మరి నో దై సెల్ఫ్‌— అంటే ఎలాగ? మన ముక్కూ— చెవులే మన కళ్ళకు కనపడవుగదా. హల్లో— గురువుగారూ! షెల్మి యస్సార్ నో, ఎప్పుడైనా మీ వీపు మీరు గోక్కున్నారా? అద్దం తెచ్చి చూపిస్తానంటారా?

అద్దమేలంటాది అందాలు తెలుప— అద్దాన్ని నమ్మకూడదండీ! ఫొటోల్నికూడా అంతే— అద్దంకాని ఫొటోలుకాని సంపూర్ణంగా ఏదీ చూపించలేవు. మీ వొళ్ళోవున్న బొమ్మల పుస్తకంలో మీకు కావలసిన పోజులే వుంటాయి. ఇంకేముందో మీకేం తెలుసు? అందుకే ఒరిజినల్స్ చూడకుండా ఫొటోల్నిచూసి అమ్మాయిలవెంటబడరుగదా హీరోదాత్తులు.

నాది జ్వరం ఫిలాసఫీకాదు. నిజం చెబుతున్నా. ఐ లైక్ పొయిట్రీ. యు లైక్ పిచ్చిబొమ్మలు మళ్ళీ చెబుతున్నా. నో దై సెల్ఫ్. చాలాసేపు వాగాను బుర్ర పగిలిపోతున్నాది. బత్తాయిపళ్ళరసంకాని హార్లిక్స్‌కాని అందుకోండి ప్లీజ్— ప్లీజ్ గెటప్ మాన్!